క్లుప్తంగా

తెనాలి ఎంఈఓ-2గా జయంత్‌బాబు

తెనాలిఅర్బన్: తెనాలి మండల ఎంఈఓ-2గా విరిచర్ల జయంత్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లా ఓగోలు మండలం ఎంఈఓగా పనిచేస్తూ బదిలీపై తెనాలి వచ్చారు. బుధవారం పట్టణంలోని పలు పాఠశాలలను పరిశీలించారు. అలాగే డిప్యూటీ డీఈఓ నిర్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ ఉన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

తెనాలిటౌన్: పట్టణంలోని డివిజన్ విద్యుత్ ఇంజినీర్ కార్యాలయంలో ఈ నెల 23న విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహిస్తున్న తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.వి.చిరంజీవి బుధవారం తెలిపారు. కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రస్ ఫోరం (సీజీఆర్ఎఫ్), విజయవాడ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అదాలత్ జరుగుతుందన్నారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేలు, ఫోరం సభ్యులు, ఎస్ఈ గుంటూరు, విద్యుత్ అధికారులు పాల్గొంటారని చెప్పారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాత పూర్వకముగా అర్జీ అందజేసి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈఈ చిరంజీవి తెలిపారు.

లారీలలో అన్ని పత్రాలు ఉంచుకోవాలి

తెనాలిరూరల్: లారీలలో వాటికి సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలని ప్రాంతీయ రవాణా అధికారి కె.ప్రసాద్ సూచించారు. తెనాలి లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆర్‌సీ, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్సు, పన్ను రసీదు వంటి పత్రాలన్నీ ఉండాలని, తనిఖీ అధికారులకు తప్పనిసరిగా చూపించాలన్నారు. వాహనాల ట్యాక్సులను ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. వాహనాన్ని స్క్రాప్ చేయదలచుకున్న వారు ఆర్‌సీ, ఇతర అన్ని పత్రాలు ఫోర్స్‌లో ఉండేలా చూసుకోవాలని, ఆన్‌లైన్‌లో ఆర్‌సీని రద్దు చేసుకోవచ్చని తెలిపారు. ఆర్టీఓ వెంట ఎంవీఐ టి.రాఘవరావు ఉన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 2160 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గురువారం కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దేవాలయ అభివృద్ధి పనులు పరిశీలన

మంగళగిరి: దాతల సహకారంతో దేవస్థానం అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో చేపట్టిన ఫ్లోరింగ్ పనులను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో దేవస్థాన ట్రస్టు బోర్డ్ చైర్ పర్సన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక, ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సంకా బాలాజీ గుప్తా, నేరెళ్ల మురళి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో రూ.49.50 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్ పనులను బుధవారం కార్పొరేషన్ డి.ఇ. కృష్ణారెడ్డి పరిశీలించారు. వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో శివభాస్కర ఎన్‌క్లేవ్ నుంచి వడ్డేశ్వరం జిల్లాపరిషత్ రోడ్డు వరకు 400 మీటర్ల పొడవున 5 మీటర్ల వెడల్పున రోడ్ నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు.

కొలనుకొండలో పొదలు తొలగింపు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ కొలనుకొండులోని విశ్వబ్రాహ్మణ శ్మశాన వాటిక, ముస్లిం బరియల్ గ్రౌండ్‌లో బుధవారం పొదలు తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. త్వరలో ఈ రెండు శ్మశానవాటిల్లో గ్రావెల్ ఫిల్లింగ్ చేపట్టనున్నట్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి తెలిపారు.

పది కంప్యూటర్ల బహూకరణ

మంగళగిరి: మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ పరిధి నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, ఎన్నారై కొండా చంద్రశేఖర్ రెడ్డి పది కంప్యూటర్లను బహూకరించారు. బుధవారం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల రిటైర్డు హెచ్‌ఎం భీమిరెడ్డి శివారెడ్డి చేతుల మీదుగా కంప్యూటర్లను అందజేశారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజీవ్ రత్న మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివి విదేశాల్లో స్థిరపడిన ఎన్నారై, రూరల్ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొండా చంద్రశేఖర్ రెడ్డి పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించాలనే లక్ష్యంతో రూ.2లక్షలతో కంప్యూటర్లను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జేమ్స్, వాణి, లక్ష్మి, శ్రీనివాసరావు, రవి, శంకర్, రాజారెడ్డి, శేఖర్, శ్రీనివాసరెడ్డి, రజని, పద్మజ, శ్రీలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

యోగ భాగ్యం!

● ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం ● పాఠశాలలు, వివిధ సంస్థల్లో యోగాపై ప్రత్యేక అవగాహన



తెనాలిలో యోగాసనాలు చేయిస్తున్న ఎస్వీయోగ కన్వీనర్ రమణయ్య



యోగాసనాలు గురించి వివరిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

తెనాలిటౌన్: అంతర్జాతీయ యోగ దినోత్సవం బుధవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో జరిపారు. కొత్తపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూల్, రజకపేట ఎలిమెంటరీ స్కూల్, గాంధీనగర్‌లోని ఉర్దూ పాఠశాలలో యోగా దినోత్సవం జరిపారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య విద్యార్థులతో ఆసనాలు వేయించి వాటి ఉపయోగాలను తెలిపారు. యోగ సాధకులచే ఆసనాలు వేయించారు. యోగా గురువులు కొత్తమాసు నాగేంద్రరావు, కూనల బాపిలాల్, రేవత్, కుమారి, అనూష, సౌజన్య, రమాదేవి యోగాసనాలు వేయించారు. ప్రతిరోజు సూర్యోదయం ముందు యోగసనాలు వేసినట్లయితే అనేక జబ్బులు మటుమాయమవుతాయన్నారు. కార్యక్రమంలో తన్నీరు శివశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

ఒత్తిడిని చిత్తుచేసే ఆయుధం..

తూములూరు(కొల్లిపర): ప్రతి రోజు కొంత సమయం యోగా సాధన ఆనందాన్నిస్తుందని, ఒత్తిడిని జయించేలా చేస్తుందని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.సూర్యప్రకాశరావు అన్నారు. మండలంలోని తూములూరు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నేషనల్ యోగాడే సందర్భంగా విద్యార్థులకు వివిధ యోగా గురించి వివరించారు. హెచ్‌ఎం ఎం.జయరత్నరాణి మాట్లాడుతూ యోగా సాధన వలన అనేక రోగాలు దరి చేరవని తెలిపారు. ప్రతి రోజు కొంత సమయం విద్యార్థులు యోగా సాధన చేయాలని సూచించారు. ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ అర్చన, ఉపాధ్యాయులు సాంబిరెడ్డి, రజినీకాంత్, వై.శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, టి.రమేష్, వి.రవికుమార్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర: యోగా ద్వారా దీర్ఘకాలిక రుగ్మతలను నయమవుతాయని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవుని జీవనశైలిని సులభతరం చేయడానికి, ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా దోహదపడుతుందన్నారు. యోగా అన్ని వయస్సుల వారు చేయదానికి సులభంగా ఉంటుందన్నారు. యోగా నిత్యం చేయటం వలన రక్త పోటు, గుండె పోటు వంటి రోగాలు రాకుండా నివారించవచ్చు అని అన్నారు.

జేఎంజే కళాశాలలో...

తెనాలిఅర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జేఎంజే కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు యోగా దోహదపడుతుందన్నారు. అందరూ ప్రతి రోజు యోగా చేయాలని సూచించారు. యోగా టీచర్ కుమారస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత, ఎన్‌సీసీ కేర్‌టేకర్ శారా సూజన్, డాక్టర్ నిర్మల జ్యోతి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

– 22వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా గురువు కుమారస్వామి యోగాసనాలు వేయించారు.సుబేదార్ కృష్ణ జ్యోతి, అనిల్‌కుమార్, సర్దార్ పరిశా, స్వామి నాయక్, స్వామి, జయసింహ, అమిత్, తదితరులు పాల్గొన్నారు.

'ఆహారం తీసుకున్నంతకాలం యోగా'..

తెనాలి: స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో బుధవారం ఐపీఏ-ఎస్ఎఫ్ ఏఎస్ఎన్ చాప్టర్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం, తెనాలి గురువు ముద్దాభక్తుని రమణయ్య పాల్గొని యోగ విశిష్టతను తెలియజేశారు. విద్యార్థులచే కొన్ని ఆసనాలు చేయించారు. వాటి ప్రయోజనాలను తెలియజేశారు. ఆహారం తీసుకున్నంతకాలం ఆసనాలు వేయాలని, దీనివల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ రోజులో కొంతసేపు యోగా సాధన నిత్య కార్యక్రమంగా విద్యార్థులు పాటించాలని సూచించారు. ప్రొఫెసర్ డాక్టర్ వి.కోటిరెడ్డి మాట్లాడుతూ యోగా తొలుత భారతదేశంలో ఆరంభమై విశ్వవ్యాప్తమైందని వివరించారు. ఐపీఏ-ఎస్ఎఫ్ ఏఎస్ఎన్ చాప్టర్ మెంటార్, అసోసియేట్ ప్రొఫెసర్ వై.ఫణికృష్ణ, ఎన్ఎస్ఎస్ టీం మెంటార్ కె.కల్యాణ్ చక్రవర్తి, సునీల్ కుమార్, లలితేంద్ర లోకేష్, మనోహర్, బషీర్ పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత..

తెనాలిటౌన్: యోగా ప్రతి ఒక్కరిలో ఏక్రాగత, స్పష్టతను శారీరక ఆరోగ్యాన్ని వృద్ధి చేయడానికి ఉపయోగ పడుతుందని బ్రెయిన్ జిమ్‌లో నిపుణుడు డాక్టర్ గమనం తెలిపారు. బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి పాఠశాలలో యోగా దినోత్సవాలను బుధవారం ఘనంగా జరిపారు. విద్యార్థులు పిరమిడ్ రూపంలో ఏర్పడి యోగాసనాలు చేశారు. ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.వి.సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులు శారీరక మానసిక ఎదుగుదలకు యోగా ఉపయోగపడుతుందన్నారు. సంగీతం పిల్లల్లో ఉన్న సృజనాత్మకత వెలికి తీస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో...

తెనాలి: స్థానిక కొత్తపేటలోని ఎల్ఐసీ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. యోగ గురువు తాడిబోయిన శివరామకృష్ణ నిర్వహించిన యోగ సెషన్‌లో ఉద్యోగులు యోగాసనాలను సాధన చేశారు. ఎల్ఐసీ, తెనాలి శాఖ సీనియర్ మేనేజర్ ముప్పాళ్ల గౌతమ భీమారావు మాట్లాడుతూ యోగా దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా 190 దేశాలు ఈరోజున 'వసుధైక కుటుంబం' థీమ్‌తో యోగ దినోత్సవం జరుపుకున్నట్టు తెలిపారు. ఎల్ఐసీ యాజమాన్యం కూడా ఇందుకు పిలుపునిచ్చిందని చెప్పారు. అసిస్టెంట్ డివిజనల్ మేనేజరు సీహెచ్ రమేష్ మాట్లాడుతూ యోగాతో కలిగే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాల గురించి చైతన్యం కలిగించటమే ఇందులో ముఖ్య ఉద్దేశంగా చెప్పారు. ఎల్ఐసీ ఉద్యోగులు వేదాంతం ఫణీంద్ర, తూనుగుంట్ల సరేష్, కోళ్లపూడి రాజు, దేవరకొండ వెంకటసుబ్బారావు, బి.పూర్ణనారాయణ, ఏజెంట్లు బొకినాల పీటర్‌పాల్, కె.శ్రీనివాస రెడ్డి, కె.రఘునాథ్‌సింగ్ తదితర ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు. అసిస్టెంట్ బ్రాంచి మేనేజరు బత్తుల శ్రీకాంత్, రమణకుమార్ పర్యవేక్షించారు.



యోగాసనాలు వేస్తున్న ఫార్మసీ విద్యార్థులు



పిరమిడ్ రూపంలో విద్యార్థుల యోగాసనాలు

విశ్వమానవాళి ఆరోగ్యమే యోగా దినోత్సవం లక్ష్యం

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్



ఉత్తమ నర్సును సత్కరిస్తున్న న్యాయమూర్తి పి.రాజశేఖర్

తెనాలి: విశ్వమానవాళి ఆరోగ్యమే అంతర్జాతీయ యోగా దినోత్సవ లక్ష్యమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్ చెప్పారు. పట్టణానికి చెందిన శ్రీఆంజనేయ ధ్యానయోగ మండలి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, స్వతంత్ర సమాచార హక్కు సంఘం సంయుక్తంగా బుధవారం స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్యవిద్యానిధి ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి పి.రాజశేఖర్ యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు. శ్రీఆంజనేయ ధ్యానయోగ మండలి వ్యవస్థాపకుడు కిషోర్ గురూజీ పలువురితో యోగా సాధన చేయించారు. ఇదే వేదికపై డాక్టర్ కేవీ సత్యలక్ష్మి జ్ఞాపకార్థం ఉత్తమ సేవలనందిస్తున్న ముగ్గురు నర్సులు అమూల్య, రమాదేవి, సుధారాణిలను సత్కరించారు. ఒక్కొక్కరికి రూ.3500 నగదు, సర్టిఫికెట్లను అతిథులచే పంపిణీ చేశారు. అనంతరం ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ ఐనంపూడి శరత్‌బాబు, అన్నవరపు సత్యనారాయణ, 11వ అదనపు జిల్లా కోర్టు సూపరింటెండెంట్ కోనా రాఘవయ్య, యోగమడలి సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు, నాగరాజు, కోమల, శోభనాద్రి, కడిదం కోటేశ్వరరావు, గొడవర్తి సత్యనారాయణ, జానకిబాయ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల సందర్శన



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్ఓ కన్సల్‌టెంట్ డాక్టర్ విజయకృష్ణన్

తెనాలిటౌన్: ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్‌టెంట్ డాక్టర్ విజయకృష్ణన్ బుధవారం మున్నంగి, కొలకలూరు గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. పీహెచ్‌సీల్లో రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. రోగులకు అందించే వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. టీబీ రోగుల ఇళ్లకు వెళ్లి వారిని పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ విజయకృష్ణన్ సూచించారు. తెనాలి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జీవనలత, జిల్లా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ రాజశేఖర్, ల్యాబ్ సూపర్‌వైజర్ లక్ష్మి, టీబీ సూపర్‌వైజర్ రవి, ల్యాబ్ టెక్నీషియన్ పావని, సిబ్బంది పాల్గొన్నారు.

స్వరలయ ఆధ్వర్యంలో సంగీత దినోత్సవం



శేషావతారంను సత్కరించిన సాయి లక్కరాజు

తెనాలి: పట్టణానికి చెందిన సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో బుధవారం సంగీత దినోత్సవం నిర్వహించారు. పట్టణ ముత్యంశెట్టిపాలెంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటైన సభలో ప్రముఖ నాదస్వర విద్వాంసుడు శృంగవరపు శేషావతారంను సత్కరించారు. గత ఐదు దశాబ్దాలుగా నాదస్వర కళకు అంకితమైన కళాకారుడు శేషావతారంను సత్కరించుకోవటం గొప్ప భాగ్యమని సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు అన్నారు. 80 ఏళ్ల వయసులోనూ సంగీత కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఆయన, ఎంతోమంది శిష్యులను తయారు చేశారని చెప్పారు. నాదస్వర విద్వాంసుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాకారులను గౌరవిస్తున్న స్వరలయ వేదిక నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేశారు. తనకు జరిగిన సత్కారానికి శేషావతారం కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎస్ఎన్ విద్యార్థులకు టీసీఎస్‌లో కొలువులు



ఎంపికైన 54 మంది విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్ ఇటీవల హైదరాబాద్‌లో/ వర్చువల్‌గానూ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి విద్యార్థులు 54 మందికి ఉద్యోగాలు లభించాయి. వీరికి ఏడాదికి రూ.2.4 లక్షల్నుంచి రూ.2.8 లక్షల వేతనం ఇస్తారని స్థానిక ఎమ్మెల్యే, ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఐటీ రంగంలో మాంద్యం నెలకొని కంపెనీలు రిక్రూట్‌మెంట్‌ను తగ్గించిన పరిస్థితుల్లోనూ తమ విద్యార్థులు 54 మంది టీసీఎస్‌లో బీపీఓ/ఐటీ ఉద్యోగాలను సాధించటం విశేషమని ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ చెప్పారు. ఐటీ రంగంలో నెలకొన్న పరిస్థితులను ముందే అంచనా వేసి, గత ఆర్నెల్లుగా తగిన శిక్షణనివ్వటం వల్లనే తమ విద్యార్థులు ఉద్యోగాలను సాధించగలిగారని తెలిపారు. తొలి ఏడాది నుంచి ఫైనలియర్‌కు విద్యార్థులకు అకడమిక్ విద్యతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణనిస్తున్నట్టు గుర్తుచేశారు. దీనితోపాటు వివిధ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో శిక్షణకు అవకాశం కల్పించటం, పలు సర్టిఫికెట్ కోర్సులు చేసేలా ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

ఘనంగా దత్తసాయి ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాకు అభిషేకం

ఈమని(తెనాలి): దుగ్గిరాల మండల గ్రామం ఈమనిలోని శ్రీదత్తసాయి ప్రేమమందిరం 17వ వార్షిక ప్రతిష్ట వార్షికోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. చివరిరోజున సాయిబాబాకు విశేష అభిషేకాలు, సాయి మంత్ర జప తర్పణ హోమాలు జరిపారు. మధ్యాహ్నం 1.30 గంటల్నుంచి అన్నప్రసాద వినియోగం చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా రాత్రి 8.30 గంటల్నుంచి శ్రీమహానందీశ్వర నాట్యమండలి, తెనాలి వారిచే 'పాండవోద్యోగం' నుంచి పాన్పు సీను, 'శ్రీరామాంజనేయ యుద్ధం' ప్రదర్శించారు. ఈనెల 19 నుంచి ఆరంభమైన ఉత్సవాల్లో తొలిరోజున సంప్రదాయ భజనలు చేశారు. మంగళవారం శ్రీసాయి సచ్చరిత్ర పారాయణం చేశారు. శ్రీదత్తసాయి ప్రేమమందిరం, శ్రీఅన్నపూర్ణ ఉచిత హోమియో వైద్యసేవా కేంద్రం, శ్రీకొర్రపాటి అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ఈ వేడుకలు నిర్వహించారు.

విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు



జగనన్న కిట్లు పరిశీలిస్తున్న డెప్యూటీ డీఈఓ పి.వెంకటేశ్వరరావు

ఫిరంగిపురం: విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డెప్యూటీ డీఈఓ పి.వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్, సెయింట్ ఆన్స్ తెలుగు మీడియం పాఠశాలలను బుధవారం పరిశీలించారు. క్లాసురూంలోకి వెళ్లి విద్యార్థులకు ఇటీవల అందజేసిన జగనన్న విద్యా కానుకను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులకు టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)తో గణిత బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలులో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల శాతం పెంచాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. సమావేశంలో ఉర్దూ డీఐ ఖాసిం, రెండో ఎంఈఓ సీహెచ్ రవికాంత్, హెచ్‌ఎంలు సిస్టర్ వి.తెరసమ్మ, శౌరయ్య పాల్గొన్నారు.

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

తాడేపల్లిరూరల్: భారతీయ రిజర్వ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల క్విజ్ పోటీలు బుధవారం నిర్వహించారు. తాడేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు జిల్లా స్థాయి పోటీలకు బుధవారం ఎంపికయ్యారు. తాడేపల్లి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ శ్రీమతి ఎస్.మాధురి మాట్లాడుతూబ్యాంకింగ్, ఆర్థిక సేవల కార్యకలాపాలపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సాహితి, హర్షిణి మండల స్థాయి పోటీలలో ప్రథమ బహుమతిని గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులతో రోడ్డు నిర్మాణం

తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరులో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సొంత నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. స్థానిక మహిళల అభ్యర్థన మేరకు పలు ప్రాంతాల్లో గ్రావెల్ రోడ్ నిర్మాణాలు చేపట్టారు. వీటితో పాటు గ్రామంలో వున్న ముస్లిం బరియల్ గ్రౌండ్‌కు వెళ్లే మార్గంలోను, కృష్ణుడి విగ్రహం వద్ద గ్రావెల్ ఫిల్లింగ్ చేపట్టారు.

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ బాలునికి వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. నగరంలోని కొత్తపేటకు చెందిన గాలి మనోహర్‌కు వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మహిళా నేతలు మల్లవరపు సుధారాణి, సంకె సునీత అందజేశారు.

మృతురాలి కుటుంబానికి..

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మృతురాలి కుటుంబ సభ్యులకు శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ప్రకటించిన రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ఎంపీపీ డి.సంతోషరూపవాణి, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, గ్రామ సర్పంచి ఉన్నం ఝాన్సీ, ఎంపీటీసీ షేక్ సుభాని, తుమ్మపూడి సర్పంచి షేక్ అజీజున్ పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్‌లోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన పాఠశాల హెచ్‌ఎం సాదుల్లాఖాన్‌ను అభినందించారు.

'జగనన్న సురక్ష' దేశానికే ఆదర్శం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ప్రభుత్వ పాలనపై ఎమ్మెల్యే శివకుమార్ ఎదుట సంతృప్తి వ్యక్తం చేస్తున్న మహిళ

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కార్యక్రమం దోహద పడుతుందన్నారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన తెలుసుకోవడంతో పాటు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా ఉన్న గ్రామంలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ తీసుకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ నుంచి వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి అటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను మరోసారి నమోదు చేసుకుంటారని చెప్పారు. మొత్తం 10 రకాల సేవల గురించి ప్రజల నుంచి వస్తున్న అర్జీలను గుర్తించామని తెలిపారు. జులై 1వ తేదీ నుంచి ఆయా గ్రామాల్లో నిర్వహించే సభలలో నేరుగా సమస్యలను పరిష్కరించి అక్కడికక్కడే రేషన్‌కార్డు, డెత్/బర్త్ సర్టిఫికెట్‌లు వంటివి అందజేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ కానుందని, దేశంలో ఇటువంటి కార్యక్రమం మరెక్కడా జరగలేదన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతుంటే ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుండడంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలపై అన్ని వర్గాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 1500 కోట్ల లబ్ధిని నియోజకవర్గ ప్రజలకు అందించినట్లు ఎమ్మెల్యే శివకుమార్ తెలిపారు. బుర్రిపాలెం గ్రామానికే రూ.8.50 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థలను అతి త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గోపిశెట్టి రమాదేవి, అడుసుమల్లి శ్రీను, అడుసుమల్లి అజయ్, శాఖమూరు రంగయ్య, రాచపూడి రత్నం, రెల్లి మధు, ప్రేమ్‌కుమార్, లాజర్, మరియదాసు, నాగరాజు, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, పేరం సంజీవరెడ్డి, అక్కిదాసు కిరణ్‌కుమార్, కాళిదాసు వెంకటేశ్వరరావు, కఠారి హరీష్, అడపాల నాగేశ్వరరావు, టెక్స్ బాల, ఎంపీడీఓ ఎల్.విజయాలక్ష్మణ్, ఇతర పార్టీ నేతలు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

తాడేపల్లిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న మద్యాన్ని పెనమాక గ్రామంలో బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. పెనుమాకకు చెందిన పలగాని రంగబాబు మద్యం అమ్ముతున్నాడని అందిన సమాచారం మేరకు అతడి ఇంట్లో తనిఖీ చేయగా 17 క్వార్టర్ బాటిళ్లు లభించినట్లు చెప్పారు. నిందితుడి పరారయ్యాడని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

అస్థికలను గంగానదిలోనే కలపండి..



ఆత్మహత్య చేసుకున్న వృద్ధురాలు రమాదేవి

తాడేపల్లిరూరల్: నేను చనిపోయిన తరువాత నా అస్థికలను గంగానదిలో కలపండి అదే నా చివరి కోరిక అంటూ ఓ వృద్ధురాలు ఆత్మహత్య లేఖరాసి చీరతో తాను నివాసముంటున్న ప్లాటులో బుధవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ వినోద్ తెలిపిన వివరాలు.. తాడేపల్లి రూరల్ పూజిత వాటర్ ఫ్రెంట్ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే చారుపల్లి చిన సుబ్రహ్మణ్యం, రమాదేవి (61) భార్యాభర్తలు. రమాదేవికి కొంతకాలంగా ఆరోగ్యం సరిగా లేకపోవడం, ఎక్కడ చూపించినా కుదుట పడకపోవడంతో బతికి ఉండి ఈ కష్టాలు పడడం ఎందుకని మనస్తాపం చెంది, నా చావుకు ఎవరూ కారణం కాదు, నా అస్థికలను గంగానదిలో కలపండి అంటూ తన అనారోగ్య సమస్యలను తెలియజేస్తూ లేఖ రాసి ఆత్మహత్య చేసుకుంది. జరిగిన ఈ ఘటనపై రమాదేవి కుమారుడు వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.